స్కెచ్

# స్వప్నపు నీడ క్రీనీడ!

"మాన్స"

నెల జీవితాన్ని అరవై రెండు రూపాయిల ఎనిమిదణాల కొలత బద్దతో కొలుస్తూ రోడ్డువెంట నడుస్తున్నా. నా నీడ క్రీనీడ అద్దాల కిటికీలోంచి లోపల గదిలో పడి వంకరటింకరగా నడుస్తోంది. దాని నీడ! అరవై రెండున్నర రూపాయిలు అయిపోయిన ఖాళీ పర్సు నీడ! నీడ...!

నిప్పుకోసం చుట్టూ వెతుకుతున్నాయి కళ్లు; ఎవడా 'గుర్రం డెక్క' జేబులో కలవాడని... సీమదేశాల్లో గుర్రండెక్క అదృష్టానికి గుర్తు...!

గడిచిపోయిన తియ్యని దినాల్లో (గడిచిపోయిన దినాలెప్పుడూ తియ్యగానే వుంటాయి. మరో సంవత్సరంపోతే ఈవేళ తియ్యగానే వుండివుంటుంది. సంవత్సరం క్రితం తిన్న వేముచేదు సంవత్సరం తరువాత నాలుకకు తియ్యతియ్యగా తగులుతుంది.) కోటుమినహా మిగిలిన సైకిలు వేలం వేశాను.. అయిదు సంవత్సరాలు తొక్కిన సైకిలు... స్కూలు ఫైనల్ పరీక్షలకి తీసుకెళ్ళిన సైకిలు! ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో పరీక్షఫలితాలు తీసుకొచ్చిన సైకిలు... అయిదురోజుల్లో ఆరు గుండ్రటి అన్నపు ముద్దల్లో అయిపోయింది! చక్రాలూ... సీటూ అన్నీ...!

అదే ఆలోచిస్తున్నాను.... సైకిళ్లు మింగగలిగేవాడికి పచ్చగడ్డి భోజనం కాకుండా ఎలాపోయిందీ అని....

అసలు ఈ ఆలోచనలేమీ పనికిరావు... దీన్లో చాలా నష్టాలున్నాయి. మెదడుని ఎక్కువ శ్రమపెడితే ఆకలి ఎక్కువవుతుంది. ఆకలి అయితే నీళ్ళు సరిపోవు. కోటుకూడా వేలంవేస్తే ...?

అదే ఆలోచించాలి... అరవై రెండున్నర రూపాయిలు రావాలంటే ఎన్ని కోట్లు నేలం వేయాలి...?

నీవూ నేనూ ఎవరూ కాని ఎవడికీ తెలీని మనిషి మరొకడు రోడ్డు వెంట నడుస్తున్నాడు వాడి నీడ నామీదొంగి పాకిపోయింది. ఇంటి దగ్గిర పెళ్లాంవుందా వీడికి...?

పెళ్లాలు పెళ్లి చేసుకోడమెందుకు మనల్ని? మళ్లీ విడిచి పెట్టడమెందుకో! నాకేం! బాధపడే దాకా చీరకొనకపోతే... అసలు నాపెళ్లాం కన్నీళ్లు ఎందుకుపెట్టింది? ఎందుకో!?

ఈ మధ్య ముకుందరావూ, గోవిందప్పా అంతా సమ్మె చేశారు.

"అంటే ఏమిటి?" అని అడిగాను.

"మనకి జీతం సరిపోవటం లేదు" అన్నారు. ఒక్కసారి ఇరవై వేల గుమస్తాల గొంతుకలు నా చెవిలో వినిపించాయి.

"మన పెళ్లాం పిల్లలు బతకడం కోసం" నీరసంగా అంది అయిదు రోజుల క్రితంభోంచేసిన పద్దెనిమిది వేల ఆరువందల నలభై తొమ్మిదో గొంతుక...

"పెళ్లాలు ఏడవకుండా చీరలు కొనిపెట్టడంకోసం.. ఉత్తుత్త కబుర్లు చెప్పి అన్నం వండించుకోవడం కోసం ... పిల్లలకు జబ్బొస్తేవార్కి మందులు కొనడంకోసం... నేను గెడ్డం గీసుకోనేందుకు... కోటు మాసిక వేసిన టైలర్ తమ్ముడికి బేడ అప్పుతీర్చేందుకు..."

"మనం బాయకాట్లు నడిపాం..."

"ఒప్పుకోరు... ఒప్పుకోరు.... నాకు తెలుసు..."

"విను పూర్తిగా ... మన సంఘం సమ్మె పిలుపిచ్చింది... మనమంతా ఆఫీసులు మానాలి."

నడచిన రోడ్డు మళ్ళీ నడిచాను ఎంతనడిచినా వూళ్ళో మరోకొత్త రోడ్డు కనుక్కోలేకపోతున్నాను.

ఇదుగో! ఇంకో విషయం కని పెట్టాను. ఎవరేనా ఎవర్నయినా నీ జీతం ఎంత అంటే అరవైరెండున్నర అంటారు. అది ఎన్నాళ్ళకి? నెలకి ... అంటే నెల మూడో తారీఖున! నాలుగో తారీఖున ఎంత? మూడో తారీఖున ఖర్చు పెట్టగా మిగిలింది... మూడో తారీఖున నేను ఇరవై రూపాయలు

ఖర్చుపెట్టాను. నాలుగున నా జీ(వి)త మెంత? నలభై రెండున్నర. పదహారున జీతమెంత? నోరావలించి కళ్ళను పీకేలా కోరలు చాచే ఖాళీ పర్సు ...

జీ(వి)తాన్ని మార్చాలంటే జీ(వి)తాన్ని పోతపోస్తున్న వాళ్ళు మారాలి ... ఏదో చెన్నపట్టణంలో పద్ధెనిమిదో ఫర్లాంగు ఎత్తు అంతస్థుమీద సిరాబుడ్డి మూతులో ఆకాశమంతటి తెల్లటి కాగితాల మీద "వెంకట్రావు జీ(వి)తపు కొలబద్ద అరవై రెండున్నర" అని రాసే తనకు తెలీని, ఆ అతీత వ్యక్తిని ఎవరు కనుక్కో-గలరు?

బ్రహ్మరాక్షసి ... ప్రాణం పంజరంలో రామచిలుక ... ఆరు సముద్రాలు దాటాలి ... అరటి తోటలో మర్రిచెట్టు ... దాని బోదెలో పంజరం ... దాంట్లో వుంది చిలక ... గిలగిలలాడితే రాక్షసి గిజగిజ లాడుతాడు ... చిలక చస్తే రాక్షసి చస్తాడు ... చిలకని గిజగిజ లాడించాలంటే?

చిత్రమైన ఊహలు కదూ? బజారు "నడుస్తోంది" ఆక

(తరువాయి 70 వ పేజీలో)

# సంపాదక వర్గం

## కార్యదర్శుల ప్రకటన

★

'అభ్యుదయ' కార్యాలయంలో పనిచేయడానికి, కార్యవర్గ సభ్యులలో ఒకరైన శ్రీ అనిసెట్టి సుబ్బారావుగారిని జనవరిలో పిలిపించాము. అప్పటినుంచీ ఆయన కార్యాలయంలోనే వుండి, పత్రికకూ సంఘానికీ సంబంధించిన అన్ని విషయాల్లోనూ మాకు పూర్తిగా తోడ్పడుతున్నారు.

పత్రికను ఇంకా సజీవంగానూ, ఇంకా ఆకర్షణీయంగానూ తయారు చెయ్యడానికి ప్రస్తుతం వున్న సంపాదకుల కృషి మాత్రమే చాలడం లేదు. అందువల్ల, శ్రీ అనిసెట్టి సుబ్బారావుగారిని సంపాదకవర్గంలోకి తీసుకుంటున్నాము.

కొమర్రాజు వినాయకరావు
ప్రయాగ కోదండరామశాస్త్రి

కార్యదర్శులు:
ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం.

(67వ పేజీ తరువాయి)

లయ్యేప్పుడు మిఠాయి దుకాణా లెక్కువ కనిపిస్తాయి.

రోడ్లు తుడిచేవాళ్లు పాటలు కూడా పాడతారుకదా ... అది సంతోషమా? లేకపోతే Desperation? వాళ్లు సమ్మెలు చేస్తారు. లాఠీ దెబ్బలు తింటారు, జైళ్లకు పోతారు...ఎందుకు? వాళ్ళు అడిగేది ముప్పైమూడు రూపాయిలు ఇమ్మని ... నాకు సరిపోని అరవై రెండున్నర ఇస్తే వాళ్ళు ముప్పైమూడే అడిగినా ఇవ్వరేం?

కాలవ వంతెనమీద నుంచి అనేకమంది ఇటునుంచి అటూ, అటు నుంచి ఇటూ నడిచిపోతున్నారు.

"కానీ!"

"ఒఖ్ఖకానీ!"

"గుడ్డివాడికో పైసా!"

కళ్లున్నవాళ్ళు కళ్ళు నెత్తిమీద అతుక్కుని, పక్షులూ... మేఘాలూ ... చెట్లచిటారు కొమ్మలూ వీక్షిస్తున్నారు; పర్సులు జాగ్రత్తగా మాత్రం కోటులోపల జేబులో దాచుకొని ... రిక్షాలు లాగించుకొంటున్నారు ... కారు చక్రాలు గబగబ తిప్పుతున్నారు. ఔను కాని, డబ్బున్నవాళ్లు పర్సు ఎప్పుడూ లోపల జేబులోనే దాచుకుంటారేం?

కొండమీద అద్దాలమేడమీద నా నీడపడి... అద్దాలమేడని పిడికిలితో కౌగిలించి... వేలకు వేల మైళ్ళు ఎత్తుపెరిగి...నా జుట్టంతా ప్రతి కేశమూ మానవుడుగా మారి లేచి... లేచి....శ్రమజీవుల చెమటని రక్తపు బొట్లుగా ... ప్రవహించే లావాద్రవంగా...కళ్ళల్లోంచి పగిలిన అగ్నిపర్వతాల నిప్పుల రాళ్లై పళ్ళు పటపట కొరికి...ఏటంబాంబులై...పిడుగులై... నేనే! నోటిలోంచి కారే రక్తపుచారే ... ప్రవహించిన మనీపర్సుల రక్తసముద్రమై... వెలువడిన చిరునవ్వే పద్మమై...లక్షలలక్షల, కోట్లకోట్ల శ్రామికుల కళ్ళల్లో మెరుపు స్వర్గమార్గమై ... అప్పుడే పుట్టిన పసిపాప చిరునవ్వాయి... పసిపాప అమాయిక చిరునవ్వాయి...!నేనే! నేనే!! అంతా...